# అస్తమయం

మార్గశిర మాసంచలి గడగడలాడిస్తోంది. ముసిలి ముద్దయిపోయాడు లచ్చయ్యమావ. వాతపట్లవల్ల అస్సలు మంచం మీంచి లేవలేకుండా ఉన్నాడు. 'నీ వయస్సు యెంతుంతాదిరా మాఁవ అని ఎవరేన అడిగితే -"నా నెప్పుడు పుట్టేనో యాదస్తులేదుగాని, నా కెనాపై యెల్లిపోయుండవా" అంటాడు.

వాడ్నిచూస్తేప్రతివాడికిజాలే.ముసలికాలంలోవాడికిరాకూడని కష్టాలోచ్చీశాయ్. పెళ్ళాం,కొడుకు,కూతురు - అంతా వెళ్లిపోయేరు ఈ లోకంలోంచి. ముసలాడు మాత్రం మిగిలిపోయేడు, కంకర్దెప్పి మీద ఒంటి తాటి చెట్టులాగ.

" అంతా యెలిపోయినట్టే నానూ యెల్లిపోతాను యేదో ఓ రోజున. కానయితే నాను పుట్టిన యీ మడకనే నాను బుగ్గయిపోయి, నాను తిరిగిన పొలాలంటా, సెరూలంటా కల్సిపోతే నా జఁనవ తరిస్తాది!"అంటాడు లచ్చయ్య మాఁవ.వాడా మాటలంటున్నప్పుడు యెవరైనా వాడి కళ్ళ వైపు చూస్తే యెండిపోయిన చెరువు గర్భంలో అక్కడక్కడా మిగిలిపోయిన పదును భాగాలు గుర్తొచ్చి ఏడుపొస్తుంది. మేకపోతులా బయటికి గంభీరంగా కనిపిస్తున్నా ఎవరూ లేని వేళల్లో " ఇంత పెనంచికంల నా నొక్కడ్నే ఒంటిపిల్లి రాకాసి నాగ మిగిలిపోన్ను "అని కుమిలిపోతూ ఉంటాడు. అయితే, మా పేరయ్య లేడా-ఆడే మా లచ్చియ్య మామని ఆదుకున్నాడు. వయస్సుకి చిన్నవాడే అయిన, వాళ్లనాన్న లాగే వాడూ పెద్దమనస్సున్నవాడు. ఒనాడు పొద్దున్నే వాడు లచ్చయ్యమాఁవ దగ్గిరకొచ్చి " నీ కేఁల మాఁవ బెంగ ఎవరూలేరని? మాఁవల్ల లేఁవురా?మాఁవు నిన్నొగ్గేస్తాఁవా నీ సావు నిన్ను సావమని ? నా కల్లంకాడ పాకేపిస్తాను. అందల సల్లగా తొంగోరా, సీఁవా దోఁవా నేకంట ఆయిగా గాలేస్తుంటాది. నీ కేల, ఏదో కిష్టా, రాఁవా అనుకొని కూఁకో, దినఁవలాగే యెల్లిపోద్ది. మా యింటికాడ్నుండి బోయినం ఒస్తాదిలే"

ఈ మాటలు వినగానే లచ్చయ్య మాఁవ గొంతు పూడుకుపోయింది కృతజ్ఞతతో. నెత్తి మీద పాలవాన కురిసినంత సంతోషపడ్డాడు. మెల్లిగా గొంతు సవరించుకొని "నాయనారో పేరయ్యా! ఒయిసుకి సిన్నోడివయితేనేంగాని, కొండంత మనుసున్నోడివిరా ! నాలాటి ముదరోడు నీకు దణ్ణఁవెట్టకూడదు. నీ యయ్యా నా కంటే సిన్నోడే!అందికని నీ తాతకిదణ్ణవెడతాన్రయ్య ! సచ్చి ఏ నోకాన్నున్నాడోగాని, ఆడు దరఁవరాజు నాటోడు. ఆడిసలవ్వల్లే మీ కుటఁవల్లా మంచోళ్లయినారు.

ఆ తండ్రి ఆర్సిల్లిసూర్నారాయిన మూర్తి నిన్నూ, నీ పిల్లల్ని సల్లగ సూడాల నాయనా! " అన్నాడు అతికష్టం మీద . అపయిన ఆనందం వల్ల కలిగిన దుఃఖాన్ని ఆపుకోలేక చింకి తువాలుతో ముఖం కప్పేసుకున్నాడు .

అది లగాయితు, పేరయ్య వేయించిన గుడిసెలోనే కాలం గడుపుతున్నాడు లచ్చయ్యమాఁవ. వెదురు బొంగుల్తో చేసిన నులక మంచం మీద అలాపడుకుంటాడు. ఓ చింకి బొంత, చింకి దుప్పటి, చింకిగాఁవంచా - యివే వాడికి మిగిలిన ఆస్తులు. వెనకటి రోజుల్లోనాయితే, ఎందులోకిపడితే అందులోకి చొరబడి జాంబవంతుడిలా ప్రతి దానికి నీతులు, ధర్మాలు వల్లించేవాడు. ఇప్పుడిక వయస్సు, వాతపట్లు వాడిని మంచానపడేసేయి. ఎవరేన సెయ్యిసాయం యిస్తేగాని అసలు లేవనే లేవలేడు.

పొద్దున లేవగానే, అరసివిల్లి వైపు తిరిగి "తండ్రి, సూర్నారాయనమూర్తి ! పెల్లాం, బిడ్డలు, స్నేఇతులు - అంతా ఎలిపోఁను నన్నీ లోంకంల ఒంటిగాడ్నిసేసేసి. నా నిక్కడుండిపోన్ను అడివిలో మేక పిల్లనాగ. నన్నూ బేగొట్టి కెల్లి పోవా తండ్రీ - నా నొక్కడ్నుండ లేకుంటున్నానయ్యా ఈ బూమ్మీద" అని వేడుకుంటాడు సూర్యదేవుడ్ని.

ఒకనాడు పొద్దున్న లచ్చయ్య మాఁవ తన మామూలు ప్రార్థన చేస్తున్నాడు కళ్లు మూసుకుని. వీడ్ని చూడ్డానికొచ్చిన గురయ్య"ను నొక్కడివేనేట్రా, బతకనేక బతకనేక బతుకుతున్న ముసిలోడివి? నానూ ఉన్నాను నీలాగే ఒరడ్లాగ, సావలేక, బతుకుతూ,సీ!"అన్నాడు బుర్రునముక్కు చీత్తూ . పాత్రునివల్సకి లచ్చయ్య మాఁవ 'ముదరోడయితే', కొత్త నారాయుడిపేటకి జాడగురయ్య 'ముదరోడు'. అయితే వాడి బతుకు, లచ్చయ్య మాఁవ బతుకు లాటి 'అనాది' బతుక్కాదు. చచ్చిన వాళ్లు చచ్చిపోగా, వాడికింకా ఒక్కగానొక్క కొడుకు మిగిలేడు. ఈ గుంటడేనా బతికి బాగుంటేచాలని తవిటన్న అని పేరు పెట్టేడువాడికి. ఆతవిటిగాడిప్పుడు ఇరవై ఏళ్ల యువకుడయేడు. మనిషి మంచి ఒడ్డూ పొడుగూతో చూడ్డానికి ముచ్చటగా తయారయేడు. అయితే కొడుకుతో మహగొప్ప చిక్కొచ్చిపడింది గురయ్యకి. పొలం మీద పని చెయ్యడవంటే తగని ఒళ్లు మంట తవిటిగాడికి. అంటాడు కదా - "ఏట్రయ్యా ! నీ తాతల కాడ్నుండి ఈ మెరకలంట ఎవసాయాలు సేస్తున్నారు కదా, ఏనాడేన మనిళ్లల్ల, ఎవులేన పట్టెడు వొరి మెతుకులు నోట్లో ఎట్టుకున్నార్రా? మదుపు లెట్టడఁవేగాని, ఏ నాడేన పంటకళ్ల సూసినావురా ? అంబలి గంజి తాగి తాగి నా కిసు పెత్తిపోనాదిగాని, నానీ యెవసాయం సెయ్యి లేన్రయ్య ! నా కక్కర్లేదీ బూఁవి ! దీన్ని నువ్వేటి సేస్కోవాలంటే అది సేస్కోగాని, నాను మాత్రం పట్టనెల్లి కూలేసుకుంటాను" అని.

ఈ మాట విన్నప్పటికి గురయ్య నెత్తి మీద పిడుగు పడ్డట్టయింది. తను చచ్చిపోయినాక

ఈ భూమి నింకెవడు సేద్యం చేస్తాడు? ఎనిమిత్తరాలయిందో, పత్తరాలయిందో ఈ భూమిని చుట్టు పట్ల గ్రామాల వాళ్లంత - " జాడోల్ల జిరాయితీ" అంతన్నారు. తనతదనంతరం కొడుకు నాగలి పట్టకపోతే, " జాడోల్ల జిరాయితీ ఏటవుతాది? " ఈ ఆలోచన వచ్చినప్పటికి గుండెలో ఎవరో పొడిచేసినట్లనిపించింది గురయ్యకి. ఇక ఊర్లో ఉండలేక తన కష్టాలు చెప్పుకొని ఊరట పొందాలని లచ్చయ్య మావ దగ్గరికి వచ్చేశాడు.

గురయ్య చెప్పిందంతా విని - " పర్లేదునేరా, ఇంకా గుంటడు కదా, నాల్రోజులనాగే ఎగర్తుంటాడు. ఆయెనకాడే సూస్కుంటాడెవసాయం. తాతల్నాటి మాన్నీవ్ వొదులుకోవడానికి ఎవుడికి మనుసొప్పుతాదిరా? ముందాడికో మంచి గుంటని సూసి ముడెట్టిమీ -దాంతో ఆడి ఎగుర్లన్నీ ఆటంతటవే తగ్గిపోతాయి" అని సలహ ఇచ్చేడు లచ్చయ్య మావ.

ఆ ముసిలాడి సలహా మేరకు షేర్ మహమ్మద్‌పురం నుండి చక్కని చుక్క లాంటి చీమ్మిరప కాయలాంటి పిల్లనితెచ్చి తన కొడుక్కిచ్చి పెళ్లి చేసేడు గురయ్య. పెళ్లికి చాలా రోజుల ముందు నుండే తవిటిగాడు పట్నం వెళ్లి ఇనప కొట్లో కళాసుగా కుదిరాడు. దేశంలోని జనవల్లా ఇళ్లు కట్టుకోవాలనే తాపత్రయంలో పడిపోయేరేమో, తెల్లవారి దగ్గర్నుండీ దీపాలు పెట్టిందాకా గజాలు మోస్తూనే ఉండేవారు తవిటిగాడు, వాడి జట్టులోని మిగతా కళాసులు. సాయంత్రం అయినాక లెక్క చూస్కుంటే ప్రతి వాడి చేతిలోనూ పాతిక ముప్ఫయ్ రూపాయలు కనిపించేవి. ఇంటికి బయల్దేరే ముందు ఓ రెండు కేజీల బియ్యం, కొంచెం నూనె, మసాలా, పుచ్చో, చచ్చో, చవగ్గా వచ్చే ఓ కూరగాయ, తాగడానికి తన కోసం ఓ చిన్న బస్తా గవర్నమెంటు సారా కొని పట్టుకెళ్లేవాడు తవిటిగాడు. వేడి అన్నం, అందులోకి కూర అంటే ఎలా ఉంటాయో ఇంత కాలానికి తెలిసొచ్చింది గురయ్యకి, వాడి పెళ్లానికి. కొడుకు ప్రయోజకుడయినాడని సంతోషంగా ఉన్నా, భూమిని కాదని కొడుకు కూలికి వెళ్లిపోడం మాత్రం ఎందుకనో సహించలేకపోతున్నాడు గురయ్య. కొడుక్కి పెళ్లి చేసిం తర్వాత, ఈ సమస్య కొత్త రూపంలో బయటపడింది.

కోడలు పిల్ల షేరు మహమ్మద్ పురం కోనచిన్నవాడు గారి బంధువు ఇంట్లోంచి వచ్చిన పిల్ల . తప్పిట గుళ్లు వాయించడంలో కోనచిన్న వాడి ట్రూపు దేశం అంతటా పేరు సంపాదించింది. అయితే గురయ్య కోడలు చిన్న పిల్లగా ఉన్నప్పట్నుండి తప్పిట గుళ్ల జట్టుతో కలిసి వూరూరు, పట్నాలు తిరిగింది. పట్నాలు తిరిగిన ఆ పిల్లకి, దివ్వు దివ్వులాడుతున్న కొత్త నారాయుడి పేట నచ్చలేదు. పెళ్లయి నాల్రోజులేనా కాక ముందే మొగుడితో "ఇక్కడెలట్రీ దీపాల్లేవు - ట్యూబు నైట్లు నేవు. రాతిరయిన కాడ్నిండి కొరివి దెయ్యాలు పరుగుల్తీస్తున్నాయ్. ఆటి దుక్కు సూస్తుంటే బయ్యం వేస్తంది రాత్తుళ్లంట" అంది.

పది రోజుల్నాడు మొగుడితో సినిమా చూసొస్తూ "సిరంజీవి సినిమా సూసినాక సీకట్లో రెండు కోసులు నడిసి రావాల - ఇదేం కసాల్ర మాఁవా " అని సణిగి మూతి వొంకర్లు తిప్పింది.

నెల దాటిం తర్వాత "నానిక్కడ మరుండలేను మాఁవా ! పట్టఁవెల్లి పోదాం " అని నానాచిచ్చూ పెట్టేసింది. అది మొదలు ఆ ఇంట్లో నిత్యం తగూలు, ఏడుపులు, మెర్రలు. పులి మీద పుట్రలాగ భూఁవి అమ్మేసి పట్నం పోయి వ్యాపారం చేసుకుందాఁవని తవిటిగాడి ప్రతిపాదన. భూఁవిని అమ్ముకోవడం అన్న మాట గురయ్యని నిలువునా దహించేస్తోంది. తన మనసు విప్పి చెప్పు కోడానికి మళ్లీ లచ్చయ్య మాఁవ దగ్గిరికి పరిగెత్తు కొచ్చేడు - పొద్దున్నే పలకర్ర నవులుతూ.

మార్గ శిరమాసఁ వేవో, వాడొచ్చినప్పటికింకా చీకటి విడిపోలేదు. చలి ప్రాణాలు కొరికేస్తోంది. చలికి వాతపట్లు ఎక్కువయిపోయి సలుపులు పెట్టేస్తున్నాయి లచ్చయ్య మాఁవకి. చింకి దుప్పటీని ఒంటి చుట్టూ కప్పుకోవడానికి కూడా వాడికి శక్తి లేకుండా పోయింది. " ఛీ ! ఏటీ కుక్క బతుకు' అని సణుక్కుంటున్నాడు - రాత్రి రాత్రల్లా కంటి మీద కునుకు లేక పోడంతో.

తెల్లార కుండానే ఒచ్చిన గురయ్య "ఒరే నచ్చియ్యి మాఁవా! ఇంకా నెగనేదేట్రా'' అన్నాడు గుడిసెలోకి జొరబడుతూ. వాడి వైపు తపతప చూసేడు లచ్చయ్య మాఁవ. దృష్టి కూడా బాగా తగ్గిపోయిందే మో, వచ్చిన మనిషిని పోల్చడానికి ఒక్క క్షణం పట్టింది. పోల్చగానే "గురివిగా నువ్వంట్రా? ఏది కసింత నన్ను నెగదీసి కూకోబెట్టూ మీ! " అన్నాడు. చెయ్యి సాయంఁవిచ్చి వాడ్ని లేపి కూర్చో పెట్టేడు గురయ్య. సూర్యనారాయణ మూర్తికి మామూలు మనవి అయిపోగానే, గురయ్య యిచ్చిన చుట్ట వెలిగించి, గుబ గుబ రెండు దమ్ములు లుగేడు.

తరువాత " ఏట్రా గురివిగా, పెందిలే పారొచ్చినావు ''అని భోగట్టా చేశాడు. దానికి గురయ్య " మాఁవారే ! యింటికాడ, మా సెడ్డసిక్కొచ్చి వడిపోనాదిరా ! '' అన్నాడు.

" నీకు సిక్కులేట్రా? గుంట పాపడు తిన్న నయినోడే గద - ఆడు సూస్కోడా మంచీ సెడ్డా? మనకేట్రయియా సచ్చీ దాకా సాపల మోత ? ఆడెట్టింది తిని, సల్లగ తొంగోరాదా - యేట్ర యీ కసాలల్ల ! ''

" ఒరే నచ్చియ్యి మాఁవా? ఆ సేరు మందపురం గుంటని మా వోడికి సెయ్యిడం పొరపాటయి పోనాదిరా ! అది దాని అయ్యతో కలిసి దేశఁవల్ల తిరిగొచ్చిన బొట్టి. దాని దేసల్లా (ధ్యాసల్లా) సినిమాల మీద, పట్నాల మీదే తప్ప మన పల్లెటూళ్ల మీద నేదు. అది గాగుంట పాపే మా తవిటిగోడికి సిల్లం గెట్టేసినాది. కొత్త నారాయుడి పేట వొగ్గేసి, శికాకులం ఎలిపోవాలని దానికి పట్టుకుంది. పెల్లాం కొంగట్టుకు తరిగే యీ గుంట నాకొడుక్కేటి తెలుస్తాది భూఁవిలువ? పట్టం యెల్లిపోతానని ఆడూ గెంతతన్నాడు కోతినాగ! ''

" అయితేటయిపోనాదిరా! ఎల్నీ ఆడ్ని. నీకేటి, నీ మానాన్న నివ్వు నీ మడిసెక్కల్ని సూస్కోని, నీ యింటికాడ హాయిగా తొంగో! "

" నచ్చిగా, నా నింకా కుర్రోడ్ననుకుంతన్నావేటి! నీ లాగే నానా ముదరోడ్నయిపోనాన్ర! పొలం మీది కెల్లాలంటే నాకూ ఓపికుండ కంటుందిరా! "

" అయితే, మరి నీ బాదేట్ర? "

" అది సెప్పుకో నానికే గద నీకాడికి పారొచ్చింది ! జాకర్త గిను - నాను పొలం మీది కెల్లలేను- నా కొడుక్కి పొలం అక్కర్లేదు. తాత్తండ్రుల కాడ్నిండి యీ బూదేవిన్నమ్ముకొని బతికి నోళ్లం. ఆ తల్లి మన కడుపుల కింత కూడెట్టిన్నాడు ఎట్టింది. కరువూ, కాటకం ఒచ్చిన్నాడు గెంజి తాగి బతికినాం. గత ముడ్నాలు గేల్ల బట్టి యే సెని పట్టుకుందో ఏటో తెల్డు గాని, బూమ్మీద బొత్తిగా సెనా పిక్కలేనా పండకంటున్నాయి. ఈ పంటలు పండక పోవడం చూసి వూళ్లంట కుర్రనాకొడుకులు కోతుల్లా గెంతతన్నారు - యీ కొర్ను బూఁవులు మనకేల అమ్మేద్దావంటే అమ్మే ద్దావని. ఈల్ల గెంతులకి సరిపడా, పట్నాల నుండొచ్చిన బాబుల, మన పొలాలన్నిట్నీ కొనేసి కోలనీలు కట్టేయాలని సూస్తన్నారు. ఆ బాబులుపతీ రోజు కార్లు మీద, కూటర్లు మీద పారొచ్చి, నోట్ల కట్టలు సూపుతుంటే, మన గుంట నా కొడుకుల్ని ఆప గలగ తన్నాఁవేటి? ఆల్ల దృష్టి ఎనాగున్నా దంటే, మన మెరకలు యేనాడూ పండి సావ్వ, అనాటప్పుడు యీట్నీ యిల్ల జాగాల కింద అమ్మేసి, ఆ డబ్బులొట్టుకొని పట్నాల కెల్లి పోయి, అక్కడేదో యా పారాలో, వొర్తకాలో సెయ్యాలని.

" నీకే దస్తుందో నేదో, మనం గుంటలప్పటి మాట, సెట్టోడిపేట బుగత కూతుల్లకి పెల్లిల్లు సెయ్యినానికి డబ్బు లేక బూఁవులమ్మ జూపితే, ఎకరం రొండొందలకి కొనీ నా దుడ్లేకుపోనాదు మన మడకలంట.మరియ్యాల ఆ పొలాల్నే సెంటెయ్యి రూపాల్నెక్క కొనీనానికి జనాలు కార్లు మీద పారొస్తున్నారు.అయితే పొలాల్నమ్మేసి, డబ్బు లొట్టుకొని, పట్నాలంటెల్లి అక్కడ మనఁవేటి సెయ్యాల? మన సేత పడిన సొమ్ముతో పట్టఁవంట మనం ఓ పందుల గుడిసి నాటి యిల్లేనా ఏస్కోగలఁవ?ఇక్కడయితే, మూతిమీది గ్గెంజి నేకపోయినా, పొద్దుకూకేతప్పటికి మన పాకలోనో, అరుగుమీదనో తొంగుంతున్నాం - సీఁవా, దోఁవా బెడద నేకంట, కంపూ, ఓసనా లేకంట ! ఈ పొలం నాది, ఈ గుడిసి నాది, యీ సీఁవ నాది అని మనకో నిబ్బరం, బరోసా ఉన్నా యిక్కడ. మరి పట్నాల కెల్తే అక్కడ మనకేంటుంది? అక్కడ మనఁ వెవులఁవని సెప్పుకుంటాం? మన్నెవుల సూస్తా రక్కడ? మనఁవెవుడిక్కావా లక్కడ?

"ఏ వొంద సంవత్సరాల కాడ్నిండో నా పొలాన్ని 'యిది జాడ నారాయుడిగారి మడక ' అంతన్నారు జనం. నాను, నా తండ్రి, నా తాతా యింకా ఆడి ముందోళ్లు మా యింటి పేరుని

నిలబెట్టుకొచ్చినాం. అలాటి దియ్యాళ నా కొడుకు నెగిసి " ఓరయ్యా, మనఁ యీ పొలం అమ్మేసి, పట్టవంటెల్లి మరో యాపారం సేస్కుందావురా " అంటే నాకెనగుంటాది? నాను బతికుండాగానే యీ భూఁవి నమ్మేసి, ఏడికో పోతే, దీన్నికిమీదట 'జాడోల్ల జరాయితీ' అని ఎవురేనంటారా? నా పొలా న్నొగ్గేసి, పట్నాలంటెల్లి, అక్కడెవుడికీ తెలికంట, ఏ కంపు సందులోనో సావాల? నా వల్ల కాదురా మాఁవా! సస్తే నా నిక్కడే సావాల! " అని వలవల ఏడ్చేశాడు గురయ్య, వాడ్ని ఊరడించడానికి మాటల్లేవు లచ్చయ్య మాఁవకి.

అయినా " నాయినోరే గురయ్య ! పూర్కోరా! ఏటది సిన్న గుంటడ్నాగ! నువ్వేల పోవాల్ర పట్నాలంట? ఎవుడో పదుగుమాలిన్నా కొడుకు బూఁవి బుర్రా అమ్మేసి, పట్నాలం టెల్లిపోయి, తాగి తందనాలాడతాడు. నీ కేల పడతాదిరా అలాటి కరఁవ ! పూర్కోరా, పూర్కోమీ! " అన్నాడు.

" ఇప్పుడొచ్చినిస్తగువదే కదర మాఁవా ! ' మన అరెకరం సెక్కనీ, గుడిసినీ అమ్మేస్తే ఏపియ్ వేలొస్తాయి, ఆ డబ్బోట్టికెల్లి పట్టంలో సిన్న పిండి మిల్లెడతాను - కరుసులు పోగా రోజుకి ఏపై రూపాయలు మిగుల్తాయి - కడుపు కింత తిని బతుకుతాం " - అంటున్నాడ్రా తవిటిగాడు. బూఁవమ్మి పారీయాలని ఆడిగోల. గుంటపాప పెళ్ళాం ఆడికి మద్దత్తు. ఇప్పుడు సెప్పు నానేటి సెయ్యాలో."

ఆలోచన్లో పడిపోయేడు లచ్చయ్య మాఁవ. మరో చుట్ట తీసి వెలిగించేడు గురయ్య. లచ్చయ్య మాఁవ క్కూడ మరోటి వెలిగించి యిచ్చేడు. రెండు పీల్చులు పీల్చి, " ఏటో్రా గురివిగా, నా నెటూ సెప్పనేకపోతన్నాను. మన పొలా లుత్తి మెరకలు - ఏనాడు పండిసావ్వ - ఆ మాట సత్తిఁవే ! అయితనాగని అవి పండకపోతే సచ్చిపోనాఁవా అంటే, తల్లి బూదేవి మన్ని పూరాగా సంపీనూ లేదు. ఏదో పండీది - ఎనాగో ఓనాగ బతుక్కొస్తన్నాం. పదేల్ల కిందట యీ బూఁవిల్ని సిల్లపెంకిచ్చి కొన్నానిక్కాడా ఎవుడూ ముందులకొచ్చీవాడుకాదు. మరియ్యాల బూఁవులికి దర్లు పుట్టినాయి. ఎనాటి కంకర్దెప్పినేనా యేలు యేలు పోసి కొనేసి యిళ్లు కట్టీడఁవో, కోళ్ల పారాలెట్టీడఁవో సేస్తన్నారు. నీకున్న కసింత బూఁవి అమ్మేసి, నివ్వు పట్నం ఎల్లిపోతే, అక్కడ నీకూ, కూలోడికీ తేడా నేదు. ఊరూ, పేరూ లేని సావు సావాల!

" అయితే, నీ కొడుకు సెప్పింది సజావునాగే కనిపిస్తన్నాది. సిన్న మదుపుతో ఓ మిల్లో ఏదో ఎడితే, అదుష్టం బాగుండాలి గాని, కిష్టయ్య పేటోల్లలాగ లచ్చలు గడించీవొచ్చును. పోనది జరగదనుకో, కడుపు కింత ఉడుకన్నం, కూరా తిన్నానికి లోటుండదు కదా! నానెటూ సెప్పలేకంటున్నా్రా గురయ్యా. బూఁవమ్ముకొని పట్నా లంటెల్లి పొమ్మనీ సెప్పలేను. ఈ ముసిలి కాలంల కొడుకు నుండి వేరు పడిపోయి, నివ్వొక్కడివీ యిక్కడ ఒరడ్లా వొంటిగా బతకమనీ

సెప్పలేకంటున్నాను. నా అనేఓడు ఎప్పడు నేకంట, ఒక్కడ్నే దెయ్యంనాగ బతకతన్నాను. సచ్చినప్పుడు ఒక్కలంవే సస్తాం‌వ్ నిజివేగా న్రే, బతికినన్నాళ్లు ఒంటిగా బతకడంకంటె పాడు జనంవ మరోటుందరా నాయినా !

" అంచేత గురయ్యోరే, నా నొకటి సెప్తాను, కోపం తెచ్చుకోకంటింటావా? మన తరంవయిపోనాది. మన్ని వూరు పొమ్మంతన్నాది, కాదు రమ్మంతన్నాది. నీ కొడుకి సిన్నోడింకా. రోజు లాడివి కాని మనవి కావు. అంచేత నామా టిని ఆడి కేటి యిష్టవయితే అదే సెయ్యి. కొడుకుతోటే సొరగం ! ఆ డెన కెల్లిపో. ఆడి సేతిమీదిగా నీ దినా లెల్లిపోనీ! "

చాలాసేపు మాట్లాడకుండా కూర్చున్నాడు గురయ్య. చివరికి లేచి నిలబడ్డాడు. కిందనున్న పాత తువాలు దులిపి చుట్టుకున్నాడు. తరవాత "ఒరే లచ్చయ్య మాంవా ! నువ్వు సెప్పిందల్ల సత్తింవేరా! బూంవి నమ్మీసి కొడుకుతో ఎలిపోవాలా, నేకపోతే, కొడుకు నొగ్గేసి యీ ముసిలి కాలంల ఒంటిగాడ్నయి యీ బూమ్మీదనే బతకాలా అన్నది నా నిప్పుడు తేల్చుకోవాల. పొలం మీదనే కూకొని, నా తల్లి నా మనుసుకి ఏటి సెప్తే దాన్ని సేస్తాను. మర్నా నొస్తాన్ర మాంవా! " అన్నాడు గురయ్య. వెళ్లిపోవడానికి ముందు లచ్చయ్య మాంవా చేతులు పట్టుకొని, ఆ ముసలాడి ముఖంలోకి ఆబగా చూశాడు, మళ్లీ మరోసారి ఆ ముఖాన్ని చూడ్డం కదరదేమోనన్నట్టు.

ఎండెక్కుతోంది. ఎవళ్లో వచ్చి లచ్చయ్య మాంవని, రావిచెట్టు దగ్గరికి తీసివెళ్లి, చప్టామీద కూర్చోబెట్టేరు. పేరయ్య యింటినుం డొచ్చిన అన్నం తిన్నాడు. అన్నం తిన్నాక అర్సవిల్లి వైపు తిరిగి, చేతులెత్తి దండం పెడుతూ " సూర్నాయినమూర్తీ తండ్రీ! ఏల్నాయినా మమ్మల్నిలా ఏడిపిస్తన్నావ్? ముసిలోల్లంవని కూడా కనికరం నేదా? మమ్మల్ని బే గొట్టికెల్లిపో తండ్రీ, బే గొట్టికెల్లిపో! ' అని ప్రార్థించేడు.

ఎవళ్లో చెయ్యి సాయంవిస్తే లేచి వెళ్లి, గుడిసెలో తన మంచంమీద పడుకున్నాడు. ఆ పడుకోడం పడుకోవడం మరి లేవలేదు లచ్చయ్య మాంవా.

మర్నాడు పొద్దున్న వాడ్ని లేపడానికొచ్చిన కుర్రాడు వూర్లోకెళ్లి యీ వార్త చెప్పేడు. ఊరి జనంవల్లా గుడిసెముందు పోగయేరు. "ఎలిపోన్నురా భీష్మాచార్లు మన మద్దిలెల్లి ! తండ్రి సూన్నారాయినమూర్తి కొసకేన కనికరించి, ఆదోరంనాడు తన కాడికొట్టికెలిపోయన్ను " అన్నాడు సొట్టప్పయ్య. ఊరి జనవంతా తలలూపేరు వాడి మాటల్ని అంగీకరిస్తూ.

ఇంతలో పొలం గట్లమీంచి పరిగెత్తుకొస్తున్న చెట్టు రావులు కనిపించేడు. వూరి జనంవల్లా లచ్చయ్య మాంవ గుడిసె దగ్గర చేరి వుండడం గమనించి, వాడూ యిక్కడికి పరిగెత్తుకొచ్చేశాడు. ఒగరుస్తూ, " ఇదిన్నార్రా! జాడ గురయ్యగాడు రాతిరి ఆడి మడ్లోని నూతిలో పడిపోయి సచ్చిపోన్డట.

ఇప్పుడు శవాన్ని బయిటికి తీసినారు "అన్నాడు.

ఈ మాట విని జనం అవాక్కయిపోయేరు. కొద్ది క్షణాలపాటు చీఁవ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం. మళ్లీ సొట్టప్పయ్యే అందుకున్నాడు.

" ఏట్రా యీ యిసిత్రం ! ఆడు నిన్న పెందిలే కదా యీ ముసిలాడి దగ్గిరికొచ్చింది? ఏటిల్లిద్దరూ కూడబలుక్కొని నచ్చిపోన్రేట్రు! ఇయ్యాల్తో రెండూల్లకీ మరి ముదర బుర్రల్లే కంటయిపోనాయి. " జనాలు తలూపేరు అంతే, అంతే అన్నట్లు!

ఆంధ్రప్రభ - 3-9నవంబర్, 1993

✪✪✪